క్లుప్తంగా

ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ కోచైర్మన్‌గా అశోక్



వరంగల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, ఫోర్త్ క్లాస్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కో చైర్మన్‌గా టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ నియమితులయ్యారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన జేఏసీకి అనుబంధంగా జిల్లా స్థాయిలో జేఏసీలు ఏర్పాటు చేసినట్లు అశోక్ తెలిపారు. కోచైర్మన్‌గా ఎన్నికైన అశోక్‌కు సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

డిగ్రీలో దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే మహిళా డిగ్రీ కళాశాలలో 2025 –26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మే 5వ తేదీ లోపు mjptbcwreis. telangana. gov.in, tgrdccet.cgg.gov.in, tgrdcwebలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఎలాంటి ఎంట్రన్స్ లేకుండానే అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94916 – 85294 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ



ఖిలా వరంగల్ / రామన్నపేట: వరంగల్ కాశికుంటలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో బొగ్గారపు రామకృష్ణ, ఇతర దాతల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఆరుగురు నిరుపేద దివ్యాంగులకు చంక చేతి కర్రలు, వీల్ చైర్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా రామకృష్ణ హాజరై ఆరుగురు దివ్యాంగులకు వీల్‌చైర్లు, చంక కర్రలను అందజేశారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇతర దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు విరివిగా చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో అజీమ్, చక్రపాణి, సపంత్, సతీష్, రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంపై దాడి

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంపై ఓ యువకుడు శుక్రవారం సాయంత్రం రాళ్లు రువ్వడంతో స్థానికులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వేంకటేశ్వర స్వామి దేవాలయం ఎదుట అదే కాలనీకి చెందిన యువకుడు నిలబడి రాళ్లు విసురుతుండగా చూసిన కాలనీవాసులు అతన్ని పట్టుకున్నారు. ఆలయంపై ఎందుకు దాడి చేస్తున్నావంటూ కొందరు నిలదీయగా ఆ యువకుడు ఎదురు తిరగడంతో నాలుగు దెబ్బలు వేశారు. తిరిగి కాలనీవాసులను అతడు కొట్టడానికి ప్రయత్నించగా 100కు డయల్ చేసి పోలీసులకు నిందితుడిని అప్పగించారు. సదరు యువకుడిని పోలీసులు స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడికి గల కారణాలపై ఏసీపీ తిరుమల్, సీఐ సుధాకర్ రెడ్డి విచారిస్తున్నారు.

చలివేంద్రంలో రంజన్ చోరీ

మామునూరు: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలోని రంజన్‌ను గురువారం రాత్రి ఓ ఆటో డ్రైవర్ అపహరించాడు. ఈ ఘటన వీడియో వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. స్థానికుల కథనం ప్రకారం వరంగల్ నాయుడు పెట్రోల్ బంక్ వద్ద ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి చలివేంద్రంలోని రంజన్‌ను ఓ ఆటో డ్రైవర్ తన ఆటోలో తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. ఈ విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

21న ఉద్యమకారుల ప్లీనరీ

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈనెల 21న జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్లీనరీని విజయవంతం చేయాలని ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, కార్యదర్శి గజ్జి శంకర్ కోరారు. ఉద్యమకారుల కమిటీని ఉద్యమకారులతో ఏర్పాటు చేయాలని వారు ఒక ప్రకటనలో సూచించారు. ప్రతీ ఉద్యమకారుడికి 250 గజాల చొప్పున స్థలం, జార్ఖండ్ తరహాలో రూ.25 వేలు, రూ.10 వేల కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, బస్, రైల్వే పాసులు ఇవ్వాలని పేర్కొన్నారు.

ఒకటో తరగతి నుంచి అడ్మిషన్లు తీసుకోవాలి

హన్మకొండ: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి నుంచి అడ్మిషన్లు స్వీకరించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ కోరారు. 2025 – 2026వ విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ పిల్లలకు 3వ తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తామని స్కూల్ యాజమాన్యం చెబుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదని, ఎస్సీ విద్యార్థులు.. ఇతర విద్యార్థులతో పోటీపడడం లేదని తప్పుడు కారణాలు చూపుతూ అడ్మిషన్లు నిరాకరిస్తోందని, ఇది సరికాదని ఒక ప్రకటనలో తెలిపారు.

నాసిరకంగా స్మార్ట్ సిటీ పనులు

- అనతి కాలంలోనే రోడ్లపై పగుళ్లు
- రోడ్డు కంటే ఎత్తులో డ్రెయినేజీల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



శివాలయం వీధిలో రోడ్డు కంటే ఎత్తుగా నిర్మించిన సైడ్ డ్రెయినేజీ



ఎస్సీ కాలనీలో పగుళ్లు తేలిన రోడ్డు

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్‌లో స్మార్ట్ సిటీ పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయి. నిర్మించిన అనతికాలంలోనే రోడ్లపై పగుళ్లు ఏర్పడుతున్నాయి. దాంతో ఇవేం పనులని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మడికొండ ఎస్సీ కాలనీలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు అనతికాలంలోనే పగుళ్లు చూపింది. అలాగే, డివిజన్‌లోని శివాలయం వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు కంటే ఎత్తులో సైడ్ కాలువ నిర్మించారు. ఈక్రమంలో వరద నీరు కాలువలోకి ఎలా వెళ్తుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్ల నిర్మాణంలో సదరు కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని విమర్శిస్తున్నారు. కొన్ని చోట్ల మురుగునీటి కాలువలు మలుపులు తిరిగాయని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టానుసారంగా నిర్మాణ పనులు



గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్‌లో జరుగుతున్న స్మార్ట్ సిటీ పనులను సదరు కాంట్రాక్టర్ ఇష్టానుసారం చేపడుతున్నాడు. రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదు. తనిఖీలు చేయాల్సిన అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు.

– పానగోటి వెంకట్‌రావు, స్థానికుడు

నాణ్యతకు తిలోదకాలు



గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండ ఎస్సీ కాలనీలో గత ఆరు నెలల క్రితం నిర్మించిన రోడ్డుపై పగుళ్లు తేలాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రోడ్డు అధ్వానంగా మారింది. నాసిరకంగా జరుగుతున్న స్మార్ట్‌సిటీ పనులను అధికారులు పర్యవేక్షించాలి.

– ఈదురు అనిల్, స్థానికుడు

ఎన్నికల హామీలను నెరవేర్చుతాం..



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

రామన్నపేట: కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి తీరుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 11వ డివిజన్‌లో రూ.15 లక్షల ఎంపీ ల్యాడ్ నిధులతో రంగంపేట సీసీ రోడ్డు నిర్మాణానికి వరంగల్ ఎంపీ కావ్యతో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అంటేనే అభివృద్ధి, సంక్షేమమని అన్నారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పనులను నిర్ణీత సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గన్నారపు సంగీత్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, నాయకులు సురేందర్, మహమ్మద్ సమద్, సయ్యద్ అజ్గర్, మాడిశెట్టి రాజ్‌కుమార్, శివప్రసాద్, గన్నారపు కమల్, రమేష్, క్రాంతి, పవన్, మాలతి, సుభద్ర, మహేష్, నిర్మల, ఝాన్సీ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ

వరంగల్ స్పోర్ట్స్: మునుపెన్నడూ లేనివిధంగా క్రీడల అభివృద్ధికి నిధులు కేటాయించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న నాయిని విశాల్ స్మారక, 7వ తెలంగాణ హ్యాండ్‌బాల్ హంట్, సబ్ జూనియర్స్ బాలబాలికల టోర్నమెంట్ వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరగనున్న టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 98666 44112, 91773 62040 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జస్టిస్ సుజోయ్‌పాల్‌ను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు



జస్టిస్ సుజోయ్‌పాల్‌కు పూలమొక్క ఇస్తున్న వరంగల్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు



సుజోయ్‌పాల్‌కు పూలమొక్క అందజేస్తున్న హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్ లీగల్: హైకోర్టు కార్యనిర్వాహక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌ను వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుజోయ్‌పాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, వరంగల్ పరిధిలో జిల్లాకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని, అదనంగా ఫ్యామిలీ కోర్టు, సీనియర్ సివిల్ కోర్టులను మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలస సుధీర్, పులి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు డి.రమాకాంత్, కె.రవి, సహాయ కార్యదర్శులు శ్రీధర్‌గౌడ్, అంబేద్కర్, కోశాధికారులు అరుణ, సాంబశివరావు, మహిళా కార్యదర్శులు శశిరేఖ, నాగేంద్ర, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

చెరువుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి

వరంగల్ లీగల్: వేసవి సెలవుల సందర్భంగా చెరువులు, బావులు, కాలువలు, ఇతర జలాశయాల వద్ద ఈతకు వెళ్లి సంభవించే ప్రమాదాల నివారణకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్ కోరారు. ఈమేరకు హైకోర్ట్ యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుగేందర్ మాట్లాడుతూ వేసవి సెలవుల సందర్భంగా పిల్లలు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని చెరువులు, కుంటలు, కాలువల్లో ఈతకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈక్రమంలో జలాశయాల వద్ద ప్రమాద హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో దండు చాటింపునకు చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మార్త రవీందర్ గౌడ్, జార్జ్ తాడూరి లక్ష్మీనారాయణ, గంగారపు యాదగిరి, పరికిపండ్ల వేణు ఉన్నారు.

ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ ఔటర్ రింగ్ రోడ్డు ఎలుకుర్తి క్రాస్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. 50 – 55 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు.

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఉర్సు గుట్ట సమీపం మెడికేర్ ఆస్పత్రి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతడు బూర నరేష్ స్థానికులు గుర్తించారు. మిల్స్‌కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు.

గ్రామాలకూ సేవలు విస్తరించాలి



నూతన కమిటీ బాధ్యులు

విద్యారణ్యపురి: సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్త, అవయవ, శరీర, నేత్ర, చర్మ దానాలతోపాటు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాలకు కూడా విస్తరించాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ సూచించారు. హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సదాశయ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. శరీర దానం చేసే కుటుంబానికి పార్థివ దేహం అప్పగించే సమయంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. సదాశయ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ సీహెచ్ దళపతి, ముఖ్య సలహాదారులుగా ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, సాంస్కృతిక కార్యదర్శి వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నారు. అనంతరం సదాశయ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శిగా జి.కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా సంపత్‌కుమార్, పి.వేణు, గౌరవ అధ్యక్షుడిగా సుబ్బారావును ఎన్నుకున్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కె.శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సదానందం, ఉపాధ్యక్షులుగా కె.రాంచంద్రారెడ్డి, జి.రాజలింగం, సంయుక్త కార్యదర్శిగా టి.శ్రీనివాస స్వామి, గౌరవ అధ్యక్షుడిగా పురుషోత్తం ఎన్నికయ్యారు.

తాటివనంలో గీత కార్మికుల ఆందోళన



నిరసన తెలుపుతున్న గీత కార్మికులు

కాజీపేట: నిజామాబాద్ జిల్లా ఎర్రగట్టు మండలం తాళ్ల రాంపురం గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కాజీపేట మండలం సోమిడి శివారులోని తాటివనంలో స్థానిక గీత కార్మికులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈమేరకు కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ ఆధ్వర్యంలో తాటివనంలో కార్మికులు నిరసన తెలిపారు. గౌడ మహిళలను గుడి నుంచి గెంటేసి ఈత చెట్లను దహనం చేసిన విడిసి సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సభ్యులు కోరారు. స్థానిక గౌడ సంఘం అధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్, గద్దె రాజు, కుర్ర రవి, బండి కరుణాకర్, బుర్ర నాగరాజు, బుర్ర రఘువరణ్, బొల్లికొండ రాజు, బొల్లెపల్లి కొముర‌య్య, దొనికెల కుమారస్వామి పాల్గొన్నారు.

పిచ్చుక గూళ్లు, వరి కంకుల పంపిణీ



పిచ్చుక గూళ్లు, వరి కంకులను అందజేస్తున్న రమేష్

హసన్‌పర్తి: పిచ్చుక గూళ్లు, వరి కంకులను చింతగట్టులోని మహర్షి గోశాలలో పంపిణీ చేశారు. మహర్షి గోశాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గోశాల అధ్యక్షుడు ఎస్.రమేష్ మాట్లాడుతూ పూర్వీకులు జీవుల పట్ల దయ చూపే వారని, వరి కంకులను జడలుగా కట్టి పక్షులకు ఆహారంగా అందించే వారని గుర్తుచేశారు. ప్రస్తుతం పక్షులు, వాటి గూళ్లు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో పిచ్చుక గూళ్లు, వరి కంకులను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ద్వారకా సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు కత్తి మొగిలి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, కమిటీ సభ్యులు దేవేందర్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, సంజీవ్‌కుమార్, సీతారామారావు, సందీప్ కుమార్, వెంకట్ రెడ్డి, స్వామినాయక్, వేణు, రాముచారి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

ఖిలా వరంగల్: పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రమాదేవి సూచించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా వరంగల్ 39వ డివిజన్ ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ పిల్లలకు పోషకాహారం అందిస్తూ, ఆటపాటలతో మంచి విద్యను అందించాలని అన్నారు. టీచర్లు రాధ, పుష్ప, శశికళ, సంధ్య, సుకన్య, మహాలక్ష్మి, ఆయాలు, పిల్లల తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారిని రెగ్యులరైజ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో గెస్ట్ హౌజ్‌లో పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు బాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పృథ్వీ మాట్లాడారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు, కేయూ ప్రధాన కార్యదర్శి కావ్య, ఉపాధ్యక్షురాలు అనూష, బాధ్యులు గణేష్, యాదగిరి, సాధన, లోకేష్, వంశీ, శ్రీజ పాల్గొన్నారు.

అకడమిక్ సెల్ ఏర్పాటు చేస్తాం..

- గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

దేశాయిపేట: దేశాయిపేటలోని సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఒక అకడమిక్ సెల్ ఏర్పాటు చేసేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. 50 ఏళ్లు పూర్తి చేసుకున్న బీఎస్సీ, బీజెడ్సీ తెలుగు మీడియం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో శుక్రవారం తీర్మానించారు. సీకేఎం కళాశాలలో బీఎస్సీ, బీజెడ్సీ 1972 – 75వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సుమారు 70 మంది హాజరై నాటి 15 మంది అధ్యాపకులను సన్మానించారు. ఈ సందర్భంగా కన్వీనర్ డాక్టర్ పాక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆనాటి విద్యాబోధన, కళాశాలలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను అధిగమించి అధ్యాపకుల సహకారంతో ఉన్నత చదువుల్లో రాణించి ఉపన్యాసకులుగా, డాక్టర్లుగా, వ్యాపారస్తులుగా, రాజకీయ నాయకులుగా ఎదిగామని గుర్తుచేశారు. సమ్మేళనంలో అప్పటి అధ్యాపకులు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ (రిటైర్డ్ ఐఏఎస్ అధికారి), ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ మల్లారెడ్డి, లోక్‌సత్తా అధినేత కోదండ రామారావు మాట్లాడుతూ విద్యార్థులు చేపట్టబోయే కార్యక్రమాలకు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రభాకర్, ప్రభాకర్‌రెడ్డి, రాంమోహన్ రెడ్డి, చంద్రమౌళి, సదానందం, గిరిధర్‌సింగ్, మాధవరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న వెంకటనారాయణ

నయీంనగర్: దళారీ, వ్యాపార రాజకీయాల నుంచి తెలంగాణను కాపాడుకుందామని, కుటుంబ నిరంకుశ, ఆధిపత్య, వారసత్వ రాజకీయాలను రాష్ట్ర ప్రజలు ఇక భరించలేరని తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ, రాష్ట్ర కన్వీనర్ పుల్లూరు సుధాకర్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కుటుంబ వారసత్వ నిరంకుశ పాలన సాగించిన మాజీ సీఎం కేసీఆర్.. బాధిత, సామాజిక వర్గాలకు ఎల్కతుర్తి సభలో ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 1,560 మంది ప్రాణత్యాగం చేసి సాధించుకున్న తెలంగాణను బీఆర్ఎస్ పాలనలో దొరల పాలు చేశారని ఆరోపించారు. సొంత సామాజిక వర్గానికి పదవులు, కాంట్రాక్టులు కట్టబెట్టి వ్యాపార దోపిడీని ప్రోత్సహించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసి, ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ధరణి పోర్టల్ రైతుల పాలిట శాపంగా మారిందని, 8వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వేదిక సభ్యులు సోమ రామమూర్తి, చిల్లా రాజేంద్ర ప్రసాద్, పల్లపు సమ్మయ్య, అశోక్, కృష్ణ, ప్రభాకర్ గౌడ్, ప్రవీణ్‌కుమార్, మంద వీరస్వామి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాప పరిహారార్థం సిలువ యాత్ర



ప్రార్థిస్తున్న కాసుమర్రెడ్డి



హసన్‌పర్తి: దేవన్నపేటలో సిలువ యాత్రలో విశ్వాసులు

కాజీపేట రూరల్: సర్వమానవాళి పాప పరిహారార్థమై ఏసుక్రీస్తు సిలువ మరణం పొంది సిలువ శ్రమల ద్వారా లోకానికి రక్షణ అందించారని ఫాతిమా కెథడ్రల్ చర్చి విచారణ గురువు ఫాదర్ కాసుమర్రెడ్డి అన్నారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని ఫాతిమానగర్ కెథడ్రల్ చర్చి ప్రాంగణంలో ఉదయం సిలువ మార్గం జరిగింది. ఏసుక్రీస్తు సిలువ ప్రయాణంలో 14 స్థలాల శ్రమల ఘట్టాల అంశాలను విశ్వాసులు ధ్యానించారు. చర్చి ప్రాంగణంలో రాత్రి జరిగిన సిలువ మార్గంలో ఫాదర్ కాసుమర్రెడ్డి.. ఏసుక్రీస్తు సిలువపై ఎందుకు మరణించాడనే విషయాలను వివరించి సిలువ ప్రార్థన చేశారు. అనంతరం ప్యాషన్ ఆఫ్ ది క్రైస్ట్ సినిమాను ప్రదర్శించారు. చర్చి సహాయ విచారణ గురువు ఫాదర్ ఆశీర్వాదం, కమిటీ ప్రెసిడెంట్ బొక్క దయాసాగర్, టామి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

హసన్‌పర్తి: గుడ్ ఫ్రైడే వేడుకలను హసన్‌పర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్టియన్లు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సిలువ యాత్ర ఆయా గ్రామాల్లో సాగింది. ఆయా చర్చీల పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

జరిమానా రద్దు చేస్తే బకాయిలు చెల్లిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

హన్మకొండ: జరిమానా రద్దు చేస్తేనే బకాయిలు చెల్లిస్తామని హౌజింగ్ బోర్డు వాసులు చెబుతున్నారని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు ధరావత్ భానునాయక్ తెలిపారు. హనుమకొండలోని హౌజింగ్ బోర్డులోని సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే చేశారు. ఈమేరకు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను నాయకులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భానునాయక్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా నివాసముంటున్న హౌజింగ్ బోర్డు కాలనీ ప్లాట్ల యాజమానులకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అధికారులు జరిమానా విధించారని అన్నారు. జరిమానా మినహాయిస్తేనే బకాయిలు చెల్లించేందుకు హౌజింగ్ బోర్డు వాసులు సిద్ధంగా ఉన్నారని భానునాయక్ తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు టి.ఉప్పలయ్య, నాయకులు రాజేష్, ఉదయ్, షమీమ్, లత పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



నగదు, ప్లేకార్డులను చూపిస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: ఓ ఇంట్లో రహస్యంగా సాగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసి రూ.22,390 నగదు, ప్లేకార్డులు, రెండు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి వాటర్ ట్యాంక్ సమీపం కరీమాబాద్‌లోని ఓ ఇంట్లో నలుగురు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో శుక్రవారం మధ్యాహ్నం దాడి చేశారు. కరీమాబాద్‌కు చెందిన కుమారస్వామి పరారీలో ఉండగా, హనుమకొండ కేయూ డబ్బాలు హనుమాన్ వీధికి చెందిన నార్లగిరి యాకయ్య, హనుమకొండకు చెందిన బట్టోజు వేణు, రంగశాయిపేటకు చెందిన పందిరి బీరయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ బాబులాల్ వివరించారు.

శిరీషకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు బి.శిరీషకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇంపాక్ట్ ఆఫ్ సోషల్ మీడియా ప్రమోషన్ ఆన్‌లైన్ బయింగ్ బిహేవియర్ – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శిరీషకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రాజిరెడ్డి పర్యవేక్షణలో శిరీష తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.